క్లుప్తంగా

హెల్త్ సెక్రటరీ మృతికి సంతాపం

నెల్లూరు(అర్బన్): కొండాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సచివాలయ హెల్త్ సెక్రటరీగా సేవలందిస్తూ అనారోగ్యంతో ఉమామహేశ్వరి మృతి చెందడంపై ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్, మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు, జనరల్ సెక్రటరీ కమల్‌కిరణ్ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఎల్‌హెచ్‌ఎమ్మెస్‌ను సద్వినియోగం చేసుకోండి



నార్తురాజుపాళెం రైటర్‌తోపులో అవగాహన కల్పిస్తున్న ఎస్సై హనీఫ్ అహ్మద్

కొడవలూరు : పోలీసు శాఖ ఉచితంగా కల్పించే ఎల్‌హెచ్‌మ్మెస్(లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్) సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇళ్లలోని చోరీల నుంచి రక్షణ పొందాలని ఎస్సై హనీఫ్ అహ్మద్ సూచించారు. మండలంలోని నార్తురాజుపాళెం సర్కారుతోపు, రైటర్ తోపు, దిన్నె తదితర ప్రాంతాల్లో ఎల్‌హెచ్‌ఎమ్మెస్‌పై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా ఊర్లెళ్లేటప్పుడు ఇంట్లోని నగదు, బంగారు తదితర విలువైన వస్తువులు చోరీకి గురి కాకుండా ఉండేందుకు పోలీసు వారు ఈ బృహత్తర అవకాశాన్ని కల్పిస్తున్నారని చెప్పారు. ఫలానా రోజు ఊరెళ్తున్నామని పోలీసులకు సమాచారం ఇస్తే ఆ ఇంటి ఆవరణలో పోలీసు శాఖ ద్వారా ఉచితంగానే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారన్నారు. తదుపరి ఊరెళ్లిన వారు తిరిగొచ్చాక మరలా సీసీ కెమెరాలను పోలీసు వారు స్వాధీనం చేసుకుంటారన్నారు. ఇళ్లలోని దొంగతనాలను నివారించేందుకు పోలీసు వారు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నారని తెలిపారు. అదేవిధంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైటర్ పి.వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు



పొదలకూరు : పట్టణంలో గంగమ్మతల్లి కొలుపు సందర్భంగా చివరిరోజు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 7 గంటలకు పూజలు, 11 గంటలకు ముగ్గదిష్టి తీర్పు, సాయంత్రం బోనాల ఊరేగింపు జరిగింది. మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో దేవస్థాన ప్రాంగణంలో పొంగళ్లు పెట్టుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించారు.

విద్యతోనే ఉన్నత భవిష్యత్

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నత భవిష్యత్ ఉంటుందని భద్రావతి సమేత భావనారుషీశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు చలమయ్య, నరసయ్య అన్నారు. పట్టణంలోని ఆలయ ఆవరణలో పద్మశాలీ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పలు కార్యక్రమాలు చేపట్టారు. ఇటీవల పదవీ విరమణ చేసిన డిప్యూటీ కలెక్టర్ ఎంపీ సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. అనంతరం పదోతరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారాలు అందజేశారు. చేనేత కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో సురేంద్రబాబు, మల్లికార్జున, రాధయ్య, సుధీర్ కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

మనుబోలు : 25 ఏళ్ల తరువాత దేశాలు, రాష్ట్రాలు దాటి వచ్చిన పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. వారి ఆలింగనాలు, ఆత్మీయ పలకరింపులకు మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. మనుబోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1998–99 మధ్య చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం అదే పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. మూడు నెలల ముందే ప్రణాళికలు వేసుకుని అమెరికా, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉంటున్న పూర్వ విద్యార్థులందరూ హాజరయ్యారు. ఎన్నో ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితుల ఆనందానికి హద్దులు లేకుండాపోయాయి. ఒకరి యోగక్షేమాలు మరొకరు తెలుసుకుంటూ ఆట పాటలతో సందడి చేశారు. విద్య నేర్పిన అప్పటి గురువులు వెంకయ్య, కోటేశ్వరరావు, కొండారెడ్డి, లక్ష్మయ్య, భాస్కర్‌రెడ్డి, అజయ్‌కుమార్ తదితరులను ఆహ్వానించి ఘనంగా సన్మానం చేశారు. ఈ ఏడాది ఇదే పాఠశాలలో 574 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థిని నిహారికకు నగదు పురస్కారం అందించి అభినందించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం చమర్చిన కళ్లతో ఒకరికొకరు వీడ్కోలు తీసుకున్నారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థులు చెలికం కోటేశ్వరరెడ్డి, చిట్టమూరు లక్ష్మి, పరిమళ సురేష్, ఖాదర్‌వలీ, రమేష్, జితేంద్ర పర్యవేక్షించారు.

సెల్లార్లు.. భద్రమేనా..?

- నిబంధనలకు తిలోదకాలు
- పార్కింగ్ స్థానంలో దుకాణాలు
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ విభాగం

నెల్లూరు(బారకాసు): నగరంలోని అనేక వాణిజ్య భవనాల్లో నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్లను వినియోగిస్తున్నారు. పార్కింగ్ కోసం ఉద్దేశించిన సెల్లార్లను కొన్ని ప్రాంతాల్లో మినహా మిగిలిన చోట్ల వాణిజ్యావసరాలకు వినియోగిస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు అవినీతికి పాల్పడుతూ అందినకాడికి ముడుపులు తీసుకొని అక్రమ నిర్మాణాల జోలికెళ్లకుండా మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదీ తీరు..

నగరంలోని 54 డివిజన్లలో దాదాపు ఎనిమిది లక్షల మందికిపైగా నివసిస్తున్నారు. 150 కిలోమీటర్ల మేర విస్తీర్ణం గల నగరంలో 1,83,643 గృహాలున్నాయి. ఇందులో అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాల్స్, షాపింగ్ కాంప్లెక్‌లు దాదాపు ఎనిమిది వేల వరకు ఉన్నాయి. ఇందులో సుమారు రెండు వేల బహుళ అంతస్తుల భవనాల్లో సెల్లార్లను ఏర్పాటు చేసి ఉన్నారు. వాస్తవానికి ఇక్కడ వాహనాలను నిలపాల్సి ఉండగా, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు.



గాంధీబొమ్మ సమీపంలోని ఓ భవన సెల్లార్‌లో ఏర్పాటు చేసిన దుకాణం

అప్రూవళ్లను మార్చేస్తున్న వైనం

వాస్తవానికి పార్కింగ్ కోసమని సెల్లార్లను ప్లాన్లో చూపి అప్రూవల్ చేసుకుంటున్నారు. అనంతరం దుకాణాలను నిర్మించి వాటిని అద్దెకిస్తున్నారు. నగరంలోని జీఎన్టీ రోడ్డు, మినీబైపాస్ రోడ్డు, చిన్నబజార్ తదితర ప్రాంతాల్లో గల అపార్ట్‌మెంట్లు, షాపింగ్‌మాళ్లు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, కార్పొరేట్ హాస్పిటళ్లు.. ఇలా దాదాపు 200 వరకు బహుళ అంతస్తుల భవనాల్లోని సెల్లార్లలో దుకాణాలు, గోదాములను నిర్మించి అద్దెలకు ఇస్తున్నారని సమాచారం.

ఏదీ నోటీసుల జారీ..?

నగర పరిధిలో ఎన్ని వాణిజ్య భవనాల్లో సెల్లార్లను ఎంత మంది వినియోగిస్తున్నారనే సమాచారం కార్పొరేషన్ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు ఏ ఒక్కరికీ నోటీసులను జారీ చేయలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ముంపు ప్రాంతాల్లోనూ ఇదే తంతు

నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని పలు డివిజన్లు వర్షాలు, వరదల సమయాల్లో ముంపునకు గురవుతుంటాయి. ఇలాంటి ప్రాంతాల్లోని సెల్లార్లలోనూ దుకాణాలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఢిల్లీలో సంభవించిన ఘటన నేపథ్యంలో ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

షట్టర్లు పెట్టి.. దుకాణాల ఏర్పాటు

నగరాల్లో పార్కింగ్ సమస్యలు ఉత్పన్నం కాకుండా సెల్లార్లను నిర్మిస్తుంటారు. వాస్తవానికి టౌన్‌ప్లానింగ్ నిబంధనల మేరకు నగర పాలక సంస్థలో వాణిజ్య భవనాలు పార్కింగ్ ఏరియాను కచ్చితంగా చూపాల్సి ఉంటుంది. అయితే నగరంలో సెట్‌బ్యాక్ ఎక్కడా అమలు కావడం లేదు. చాలా వరకు దుకాణాలు రోడ్డు పైకొచ్చేశాయి. కొత్తగా నిర్మిస్తున్న భవంతులు సైతం సెట్‌బ్యాక్‌ను పాటించడం లేదు. ఇది చాలదన్నట్లు.. సెల్లార్లను నిర్మించి వాటిని పార్కింగ్ కోసం కాకుండా ఆదాయవనరుగా మార్చుకుంటున్నారు. చాలా చోట్ల షటర్లును పెట్టేసి దుకాణాలకు అద్దెకిచ్చేశారు. కొందరు సొంత అవసరాల కోసం వినియోగించుకుంటున్నారు. ఫలితంగా ఆయా వ్యాపార కేంద్రాలకు వచ్చే వారు తమ వాహనాలను రోడ్లపైనే నిలపాల్సి వస్తోంది.

ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత..?



ఢిల్లీలో ఇటీవల జరిగిన ఘటనను తలుచుకుంటేనే భయమేస్తోంది. సెల్లార్లలో ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యతను ఎవరు వహిస్తారు..? ఇలాంటి ఘటనలు జరగక ముందే టౌన్‌ప్లానింగ్ అధికారులు దృష్టి సారించి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– కేపీ రెడ్డి, మైపాడు రోడ్డు

ప్రత్యేక దృష్టి సారించాలి



నగరంలోని అనేక ప్రాంతాల్లో నిర్మించిన భవనాల్లో పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన సెల్లార్లను వాణిజ్యావసరాలకు వినియోగిస్తున్నారు. ఇక్కడ దుకాణాలు, గోడౌన్లను నిర్మిస్తున్నారు. ఇలాంటి వాటిపై టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టాలి.

– రాంబాబు, గిడ్డంగివీధి, చిన్నబజార్

పార్కింగ్ లేక అనేక ఇబ్బందులు



నగరంలోని షాపింగ్‌మాల్స్‌కు వెళ్తే అక్కడ సరైన పార్కింగ్ లేకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలపాల్సి వస్తోంది. అక్కడ పార్కింగ్ కోసం వదిలిన స్థలంలో దుకాణాలు, గోదాములను ఏర్పాటు చేసుకొని ఉన్నారు. రోడ్డుపైనే వాహనాలను నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది.

– పెంచలరెడ్డి, సత్యనారాయణపురం

నిబంధనలను పాటించడం లేదు



పెద్ద భవనాలు, అపార్ట్‌మెంట్లు, షాపింగ్ మాళ్ల యజమానులు నిబంధనలను పాటించడం లేదు. అక్రమ నిర్మాణాలపై టౌన్‌ప్లానింగ్ అధికారులు దృష్టి సారించడంలేదు. సెల్లార్లలో పార్కింగ్ కోసం వదిలిన స్థలాల్లో దుకాణాలను నిర్మించి అద్దెకిస్తున్నారు.

– ఇస్మాయిల్, జెండావీధి

లక్ష్మీనృసింహుడికి విశేష పూజలు



నెల్లూరు సిటీ: స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో అభిషేకం, తిరుప్పావై సేవను ఆదివారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో జరిపారు. ఇన్‌చార్జి ఈఓ సుధీర్, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, మాజీ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీజీబీ ఉద్యోగులకు క్రీడా పోటీలు



నెల్లూరు సిటీ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఉద్యోగులకు క్రికెట్ పోటీలను కనుపర్తిపాడులోని జెడ్పీ పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. అదే విధంగా ఎఫ్ – 2 ఆడిటోరియంలో చెస్, క్యారమ్స్, షటిల్, టెన్నికాయిట్ పోటీలను జరిపారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మోహన్‌రెడ్డి మాట్లాడారు. విజేతలకు బహుమతులను బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయంలో ఆగస్ట్ 15న అందజేయనున్నారు. సీనియర్ మేనేజర్ శ్రీకాంత్ నెహ్రూ, చీఫ్ మేనేజర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా సమావేశం

నెల్లూరు(బారకాసు): బీజేపీ ఎస్సీ మోర్చా కోస్టల్ జోన్ సమావేశాన్ని మినీబైపాస్ రోడ్డులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్ మాట్లాడారు. హర్ ఘర్ తిరంగా, అమ్మ కోసం ఒక చెట్టు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. మోర్చా మండల, జిల్లా కమిటీలను నియమించాలని సూచించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పరుసు మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి మోజెస్, జోనల్ ఇన్‌చార్జి అనిల్, వెంకటేశ్వరరావు, చెన్నయ్య, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవానంద్

ఉప్పలపాడు బస్సుతో తరచూ సమస్యే

నెల్లూరు సిటీ: ఉప్పలపాడుకు వచ్చే ఆర్టీసీ బస్సు తరచూ మొరాయిస్తోందని, సమస్యను పరిష్కరించాలని గండవరానికి చెందిన రమేష్ కోరారు. డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నెల్లూరు ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ ఆదివారం నిర్వహించారు. వివిధ సమస్యలను ప్రయాణికులు తెలియజేశారు. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

- డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నామని నెల్లూరు రెండో డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్ తెలిపారు. సోమవారం సాయంత్రం నాలుగు నుంచి ఐదు మధ్య 99592 25642 నంబర్‌ను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.

ఆత్మీయ సత్కారం

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఎంఈఓలుగా.. ప్రధానోపాధ్యాయులుగా.. ఉపాధ్యాయులుగా పని చేస్తూ ఈ విద్యాసంవత్సరంలో ఉద్యోగ విరమణ పొందిన వారికి ఆత్మీయ సత్కారాన్ని నగరంలోని జెడ్పీ కార్యాలయంలో ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘ సీనియర్ నేత జానకీరామ్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అనంతరం నెల్లూరు రూరల్ ఎంఈఓ – 1 భిక్షాలు, రాపూరులో విధులు నిర్వర్తించిన మేరీ, వృత్తి విద్య ఉపాధ్యాయుడు సూర్యనారాయణను సన్మానించారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు రమేష్, ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైమ్): బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా సాంబశివరావు బాధ్యతలను ఆదివారం స్వీకరించారు. ఎస్సై విజయశ్రీనివాస్, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడారు. స్టేషన్ పరిధిలో నేర నియంత్రణకు పక్కా ప్రణాళికతో ముందుకెళ్తామని చెప్పారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక శక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

అర్జీల స్వీకరణ నేడు

నెల్లూరు(బారకాసు): తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం తదితరాలపై ప్రజలు అర్జీలను అందజేయొచ్చని కమిషనర్ సూర్యతేజ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ భవనంలో సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం వరకు అర్జీలను స్వీకరించనున్నామని చెప్పారు.

రేపట్నుంచి పవిత్రోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవాలను మంగళవారం నుంచి ఈ నెల 19 వరకు నిర్వహించనున్నామని దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంకురార్పణ, హోమంతో కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయని, భక్తులు తరలిరావాలని కోరారు.

పాటల పోటీలు రేపు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(అర్బన్): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం, దేశభక్తి పాటలపై పోటీలను మంగళవారం మధ్యాహ్నం నిర్వహించనున్నామని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం, సాంస్కృతిక రంగ కన్వీనర్ పుల్లయ్య పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. విజేతలకు బహుమతులను అందజేయనున్నామని వివరించారు. ట్రస్ట్ నిర్వహణ కమిటీ కన్వీనర్ నగేష్, బాధ్యులు జయరామిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో హల్‌చల్

నెల్లూరు(క్రైమ్): నగరంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో గల గృహాల వద్ద ఓ యువకుడు గంజాయి మత్తులో ఆదివారం హల్‌చల్ చేశారు. అటుగా వెళ్తున్న వారిని దుర్భాషలాడటంతో పాటు స్థానికంగా ఉన్న ఇళ్ల వద్దకెళ్లి తలుపులు కొడుతూ వీరంగం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరుపుతున్నారు.

అలంకారప్రాయంగా వీధి దీపాలు

నెల్లూరు(బృందావనం): కొత్తూరు న్యూ జర్నలిస్ట్ కాలనీలోని మెయిన్ రోడ్డులో గల వీధి దీపం నెల రోజులుగా వెలగడంలేదు. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో అంధకారం అలుముకోవడంతో రాత్రి వేళ రాకపోకలు సాగించాలంటేనే స్థానికులు భయపడుతున్నారు. కేంద్రీయ విద్యాలయానికి వెనుక వైపున ఉన్న మల్లయ్యగుంటలో వందలాది కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. విషసర్పాల సంచారం అధికంగా ఉండటంతో హడలిపోతున్నారు. వీధి దీపం వెలగని విషయాన్ని అధికారులకు తెలియజేసినా ప్రయోజనం కరువవుతోంది. మరోవైపు ఇదే అంశమై లైన్‌మెన్‌ను ప్రశ్నించగా, మెటీరియల్ కొరత ఉందని.. వచ్చిన వెంటనే సమస్యను పరిష్కరిస్తున్నామని చెప్తున్నారు.





రోడ్డు నిర్మించారు.. డివైడర్‌ను మరిచారు

పొదలకూరు రోడ్డులో రహదారిని నూతనంగా నిర్మించినా, డివైడర్‌ను ఏర్పాటు చేయడాన్ని విస్మరించారు. ఈ తరుణంలో వాహనదారులు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి డివైడర్‌ను ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





వీఎస్‌యూ వలంటీర్లకు అభినందన



వెంకటాచలం : ఢిల్లీలో జరగనున్న 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఎంపికైన విక్రమసింహపురి యూనివర్సిటీ(వీఎస్‌యూ) వలంటీర్లను ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ విజయభాస్కరరావు ఆదివారం అభినందించారు. రాష్ట్రం నుంచి 20 మంది వలంటీర్లు ఎంపిక కాగా, వారిలో వీఎస్‌యూ నుంచి యుగంధర్‌రెడ్డి, ఇండ్ల లవకుమార్ ఎంపికయ్యారు. వీరిని ఇన్‌చార్జి వీసీతో పాటుగా ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, ప్రిన్సిపల్ విజయ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఉదయ్‌శంకర్ తదితరులు అభినందించారు.